


జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శనివారం 07 ఫిబ్రవరి 2026 | వెల : రూ 2/- | పేజీలు : 04 | సంపుటి : 1. సంచిక : 251 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత

## బిల్‌గేట్స్ పర్యటన తేదీ మార్పు... 16న ఏపీకి రాక, సీఎం చంద్రబాబుతో కీలక భేటీ



సందేశం టైమ్స్, అమరావతి, ఫిబ్రవరి 7: ఈ నెల 18న జరగాల్సిన బిల్‌గేట్స్ ఆంధ్రప్రదేశ్ పర్యటన షెడ్యూల్ మారి ఈ నెల 16న ఏపీకి రానున్నట్లు ఖరారైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో బిల్‌గేట్స్ భేటీ కానున్నారు. వ్యవసాయం, విద్యారంగాల్లో ఏఐ టెక్నాలజీని వినియోగంలోకి తీసుకురావడంపై ఏపీ ప్రభుత్వంతో బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకోనుండగా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ కార్డుల అమలుపై కూడా చర్చ జరగనుంది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో 'సంజీవని' పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం అమలు చేస్తుండగా, అమరావతిలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇదిలా ఉండగా ఈ నెల 19న ఢిల్లీలో జరిగే 'ఏఐ సమ్మిట్'లో బిల్‌గేట్స్‌తో పాటు సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు.

## హైదరాబాద్ నగర అభివృద్ధికి రెండేళ్లలో రూ.20 వేల కోట్లు – ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 7: హైదరాబాద్ మహానగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించిందని, ఇంత పెద్ద మొత్తంలో నగరాభివృద్ధికి పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షోలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో రూ.1,950.52 కోట్లు, హెచ్ఎంసీఎస్‌బీ పరిధిలో రూ.12,500 కోట్లు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.4,365 కోట్లు కేటాయించినట్లు వివరించారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులు, ప్రతిభ, జీవన నాణ్యతలో దేశంలోని నగరాలతోనే కాదు ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడుతోందని, నగరం చుట్టుపక్కల ఉన్న 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. హెచ్-సిటీ కార్యక్రమం కింద రూ.7,032 కోట్లతో 45 ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, కేబీఆర్ పార్క్, పడమటి, ఉత్తర, తూర్పు, దక్షిణ హైదరాబాద్ ప్రాంతాల్లో సమతుల్య అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ పెట్టుబడులు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తూ, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేసి సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా సమగ్ర మాస్టర్ ప్లాన్లు, వరదల భద్రత, పర్యావరణ అనుకూల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



## జోగిపేట్ 13వ వార్డులో జోరుగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం – కారు గుర్తే అభివృద్ధికి సరైన ఎంపిక: పొట్లూరి శేఖర్

సందేశం టైమ్స్, జోగిపేట్/ఆందోల్, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆందోల్ నియోజకవర్గం జోగిపేట్ పట్టణంలోని 13వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పొట్లూరి శేఖర్ ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, పట్టణాల సమగ్ర అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల రంగాల్లో చారిత్రాత్మక అభివృద్ధి సాధించిందని తెలిపారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారని, ప్రజల అవసరాలే కేంద్రంగా పాలన సాగించిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట కుమార్, ఆకుల శంకర్, డాకురి అశోక్, సల్మాన్ ఖాన్, అల్మాస్ ఖాన్, అజ్గర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రచారానికి ప్రజల నుంచి లభిస్తున్న స్పందనను బట్టి బీఆర్ఎస్ విజయం ఖాయమని, పార్టీ విజయదిశగా దూసుకుపోతోందని పొట్లూరి శేఖర్ ధీమా వ్యక్తం చేశారు.



## మార్చిలో ప్రారంభానికి సిద్ధమైన TIMS సనత్‌నగర్ – ఫిబ్రవరి 28లోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్-సనత్‌నగర్, ఫిబ్రవరి 7: తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (TIMS), సనత్‌నగర్‌ను మార్చిలో ప్రజలకు అందుబాటులోకి తేవడానికి చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని, ముఖ్యమంత్రి మరియు రోడ్లు & భవనాల శాఖ మంత్రి ఆదేశాల మేరకు రవాణా, ఆర్&బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆసుపత్రి ప్రాంగణాన్ని విస్తృతంగా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యా డైరెక్టర్, TGMSIDC, MHIDC అధికారులు, ఆర్&బీ ఇంజినీర్లు, ఈపీసీ కాంట్రాక్టర్ మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (MEIL) ప్రతినిధులతో కలిసి ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ విభాగం (CSSD) సహా అన్ని అంతస్తుల్లో కొనసాగుతున్న పనులను సమీక్షించారు. ఫిబ్రవరి 28లోగా మిగిలిన సివిల్, మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని, 200 ఆక్సిజన్ లైన్లు, 65 నర్సింగ్ స్టేషన్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి ట్రయల్ రన్స్ నిర్వహించాలని ఆదేశించారు. లాండ్రీ సేవలు, కర్టెన్లు, ఐసీయూ మరియు ఎమర్జెన్సీ బెడ్ రైలింగ్స్, సైన్‌బోర్డులు వంటి సహాయక వసతులు నెలాఖరులోగా సిద్ధం చేయాలని సూచించగా, ఈపీసీ పరిధిలోని వైద్య పరికరాలు అమర్చినట్లు, మొత్తం 540 వైద్య మరియు అనుబంధ పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 12 నుంచి తొలి దశలో 100 మంది వైద్య, పారా వైద్య, హౌస్‌కీపింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించగా, నెలాఖరుకు పూర్తి సిబ్బంది నియామకం పూర్తవుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1,059 గదుల్లో 225 గదులను పరిశీలించగా, ఫిబ్రవరి 9లోగా మరో 500కు పైగా గదులను స్వాధీనం చేసుకుని, ఫిబ్రవరి 12 నుంచి బెడ్లు, పరికరాలు అమర్చి ప్రత్యక్ష పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చిలో TIMS సనత్‌నగర్ ప్రారంభమైతే హైదరాబాద్ నగరానికి మరో కీలక ప్రభుత్వ వైద్య సంస్థగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## హెపటైటిస్–బి నివారణకు టీకా కార్యక్రమం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: సంగారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న యూపీఎస్సీ కేంద్రంలో హెపటైటిస్-బి వ్యాధి నివారణకు టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, దంత వైద్య సంఘ సభ్యులకు హెపటైటిస్-బి టీకాలను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఎం. వసంతరావు ఈ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, జిల్లా పర్యవేక్షణ అధికారి (డీఎస్‌ఓ) డాక్టర్ మనోహర్ రెడ్డి, యూపీఎస్సీ వైద్య అధికారి డాక్టర్ శశికర్‌తో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇటువంటి టీకా కార్యక్రమాలు అత్యంత కీలకమైనవని వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు.

## కోదాడ: రైతుల యూరియా సమస్య – ఆవేదన, నిరసన, ధర్నా



సందేశం టైమ్స్, కోదాడ, ఫిబ్రవరి 7 (రిపోర్టర్లు: B. విశాల్ – కోదాడ నియోజకవర్గ ఇంచార్జ్): కోదాడ నియోజకవర్గం చిలుకూరు మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా సరఫరా సమస్యపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరిపడా లభించక పోవడంతో రైతులు కన్నీళ్లు పోసి, యూరియా యాప్‌ను రద్దు చేయాలని, సొసైటీకి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కొందరు రైతులు పురుగు మందు డబ్బాలతో ధర్నా చేపట్టి, ఆత్మహత్యాయత్నం వరకు వెళ్లడం తెలిసిందే. స్మార్ట్ ఫోన్ ఉన్నవారికి మాత్రమే యూరియా దొరకడం, కీ ప్యాడ్ ఫోన్ ఉన్న రైతులు మరియు అసలు ఫోన్ లేని రైతులు ఏం చేయాలో పరిస్థితి చూపిస్తోంది. పొలాల్లో కడుపునిండే తాగితేనే రైతుకు జీవితం, మరో వైపు యూరియా యాప్‌ల ద్వారా వ్యవహరించే వ్యవస్థ రైతులను మోసం చేస్తున్నందుకు ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిపై బిఆర్ఎస్ పార్టీ ఎస్టి సెల్ అధ్యక్షులు భూక్యా బోస్ స్పందిస్తూ, రైతుల సమస్యలను ప్రతిపక్ష నేతలతో పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. రైతుల ఆవేదన, నిరసనలు, యూరియా సరఫరా సమస్య తీవ్రతలో కొనసాగుతూనే ఉంది.

## జోగిపేట 13వ వార్డులో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి మ్యాదరి పాపయ్య ఇంటింటి ప్రచారం



సందేశం టైమ్స్, జోగిపేట, ఫిబ్రవరి 7: జోగిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి మ్యాదరి పాపయ్య గురువారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని స్థానిక సమస్యలపై చర్చించారు. గత రెండు పర్యాయాలుగా వార్డులో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆయన పేర్కొంటూ, తాను ఎన్నికైతే రోడ్డు సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సమస్య పరిష్కారం, వీధి దీపాల పునరుద్ధరణ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రాజు రాథోడ్, రంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, జిల్లా నాయకులు నవాబు గారి భూమయ్య, శివచందర్, మధు రెడ్డి, మల్లేశం, రాజు, సుజిత్ కుమార్, ప్రణీత్, జయరాం, లీగల్ ఇన్‌చార్జి చంటి ప్రభు, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ రుద్రారం మల్లేశం, చక్రి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఇందిరానగర్‌లో హెపటైటిస్-బి టీకా కార్యక్రమం




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: సంగారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న యూపీఎస్సీ కేంద్రంలో హెపటైటిస్-బి వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మరియు దంత వైద్య సంఘ సభ్యులకు హెపటైటిస్-బి టీకాను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఎం. వసంతరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, జిల్లా పర్యవేక్షణ అధికారి (డీఎస్‌ఓ) డాక్టర్ మనోహర్ రెడ్డి, యూపీఎస్సీ వైద్య అధికారి డాక్టర్ శశికర్‌తో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి టీకా కార్యక్రమాలు అత్యంత కీలకమైనవని వైద్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలి కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్



(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )ఫిబ్రవరి 7

తెలంగాణ రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో, 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశం యన్. ఆశన్న గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా, అనంతరం సంఘం నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత బడ్జెట్‌లో గీత కార్మికులకు తక్కువ నిధులు కేటాయించడమే కాకుండా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ వంటి హామీలు ఇప్పటికీ అమలుకాలేదని పేర్కొన్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నిరాహార దీక్ష చేపడుతున్నామని, గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, గీత కార్మిక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



## జోగిపేట 2వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి జిన్నా విజయ్‌కుమార్ ఇంటింటి ప్రచారం

సందేశం టైమ్స్, జోగిపేట, ఫిబ్రవరి 7: జోగిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆందోల్ మండలం జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జిన్నా విజయ్‌కుమార్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి డబుల్ బెడ్‌రూమ్ నివాస ప్రాంతాల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రచారంలో ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## రాయికోడ్ నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నదరి రమేష్‌కు ఘన సన్మానం



సంగారెడ్డి ఫిబ్రవరి 7( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్సం) సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో ఇటీవల ఏర్పాటు చేసిన నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నదరి రమేష్, ఉపాధ్యక్షుడు సాయిరాం శెట్కార్, ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు రాయికోడ్‌లోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ కార్యాలయంలో ఆలయ ఛైర్మెన్ సతీష్ కుమార్ (ప్రభాకర్ రావు), వైస్ ఛైర్మెన్ భీమన్నలు ప్రెస్ క్లబ్ నూతన నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అక్షంతలు వేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆలయ కమిటీ నాయకులు జర్నలిస్టులు తమ వృత్తితో పాటు ఆలయ అభివృద్ధిలో భాగస్వాములై సహకరించాలని ఆకాంక్షించారు. రానున్న జాతర ఉత్సవాల వివరాలను కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రెస్ క్లబ్ నాయకులు ఆలయ కార్యక్రమాల కవరేజ్‌తో పాటు ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బసంతి, వీరయ్య స్వామి, సంగమేశ్వర్ పాటిల్, డాక్టర్ వెంకటేశం, సంగన్న, ఇందూరి కృష్ణ, సందీప్ స్వామి, బస్వరాజ్ స్వామి, మఠం బస్వరాజ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఐ న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ

రాయికోడ్ ఫిబ్రవరి 7( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్ )సంగారెడ్డి జిల్లా రాయికోడ్ లోని శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయం లో శుక్రవారం ఆలయ కమిటీ ఛైర్మెన్ సతీష్ కుమార్ కులకర్ణి, వైస్ ఛైర్మెన్ గువ్వ భీమన్న మరియు ఆలయ కమిటీ ధర్మకర్తలు ఐ న్యూస్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ ఐ న్యూస్ ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తోందన్నారు. ఐ న్యూస్ లోని ప్రసారాలు ప్రభుత్వం ప్రజలకు అనుసంధానం చేస్తూ కొనసాగే వార్త కథనలు ప్రజలకు ప్రయోజనకారంగా ఉంటాయన్నారు. ఐ న్యూస్ లో ఇన్ డెప్త్, ఇదీ నిజం, ప్రైమ్ టైం డెబిట్, ఫోకస్లోగుట్టు, న్యూస్ ఎజెండా, ఐ మాక్స్,తదితర కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయిన్నారు.కార్యక్రమం లో ఆలయ కమిటీ వైస్ ఛైర్మెన్ గువ్వ భీమన్న, ధర్మకర్తల మండలి సభ్యులు బసంతి,వీరయ్య స్వామి, నాయకులు బి. సంగమేశ్వర్ పాటిల్, డాక్టర్ వెంకటేశం, సంగన్న, సందీప్ స్వామి, మల్లప్ప,ఆలయ సిబ్బంది, అర్చకులు ఇందూరి కృష్ణ, ఈశ్వరయ్య స్వామి,బస్వరాజ్ స్వామి,మఠం బస్వరాజ్ స్వామి, రంగనాథ్ తదితరులు ఉన్నారు.



## అందోల్-జోగిపేట్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు – కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారంలో జోరు

సందేశం టైమ్స్, అందోల్-జోగిపేట్, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 20 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల అధికారిక జాబితాను ప్రకటించగా, అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా సుమారు 16,550 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా 15వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి చిట్టిబాబు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ గత 25 నెలల కాలంలో మున్సిపాలిటీలో సుమారు రూ.250 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, అదేవిధంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.320 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. మంత్రి దామోదర్ రాజనరసింహ కృషితో జోగిపేట్ నుంచి అజ్జమర్రి వరకు రహదారి అభివృద్ధి, సంగుపేట నుంచి అన్నసాగర్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం, అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎన్‌హెచ్-161 వరకు రోడ్డు విస్తరణ, కొత్త మున్సిపల్ కార్యాలయ భవనం, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం వంటి ప్రధాన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల స్థాపన, వివేకానంద పార్క్ అభివృద్ధి, అందోల్ చెరువు సుందరీకరణ, సాంస్కృతిక భవనం, ఆర్డీఓ కార్యాలయం మరియు నివాస సముదాయం, మున్సిపల్ ప్రవేశద్వారం వద్ద వెల్‌కమ్ ఆర్చ్ నిర్మాణం వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యారంగంలో పాలిటెక్నిక్ కళాశాల, కేజీబీవీ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పూర్తయ్యిందని, పట్టణ పరిధిలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఇందిరమ్మ ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, డ్రైనేజీ విస్తరణ, ఉపాధి కల్పనకు పరిశ్రమలు, వృద్ధాప్య మరియు దివ్యాంగుల పింఛన్ల అమలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు తెలిపారు.



## జోగిపేట్ 8వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి రాచకొండ రత్నం గౌడ్ ఇంటింటి ప్రచారం

సందేశం టైమ్స్, జోగిపేట్, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అందోల్-జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాచకొండ రత్నం గౌడ్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందని పేర్కొంటూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పాలన సాగిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరించిన ఆయన పట్టణ అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే సమిష్టి కృషి అవసరమని అన్నారు. ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం కలిగిందని రాచకొండ రత్నం గౌడ్ తెలిపారు.

# 2026-28 అక్రిడిటేషన్ కార్డుల జారీకి దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, మెదక్, ఫిబ్రవరి 7: 2026-28 సంవత్సరాల కాలానికి నూతన అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ కమిషనర్ శ్రీమతి ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గౌరవ సమాచార & ప్రజా సంబంధాల శాఖ మంత్రి గారు 02.02.2026న సమాచార & ప్రజా సంబంధాల శాఖ నూతన వెబ్‌సైట్‌తో పాటు అక్రిడిటేషన్ మాడ్యూల్‌ను అధికారికంగా ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు 28.02.2026న ముగియనున్నందున 2026-28 సంవత్సరాలకు గాను కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను కమిషనర్, సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ, హైదరాబాద్‌కు సమర్పించాలని, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం సంబంధిత జిల్లాల జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారులకు (డీపీఆర్వోలు) పేర్ల జాబితాను పంపవచ్చని సూచించారు. మీడియా యాజమాన్యాల ద్వారా పేర్లు పంపబడిన జర్నలిస్టులు సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in� ను సందర్శించి అక్రిడిటేషన్ కోసం తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని, రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ తేదీని 09.02.2026గా ఖరారు చేసినట్లు కమిషనర్ వివరించారు.



# జోగిపేట 9వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తుపాకుల మీనా సునీల్ కుమార్ ఇంటింటి ప్రచారం

సందేశం టైమ్స్, జోగిపేట, ఫిబ్రవరి 7: జోగిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి తుపాకుల మీనా సునీల్ కుమార్ గురువారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రతి గడపను సందర్శిస్తూ వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి వార్డు సమస్యలను తీసుకువెళ్లి అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుపాకుల సునీల్ కుమార్, శేఖర్, కన్నా అనిల్ రాజ్, పుట్నాల బాలరాజ్, మైనుద్దీన్, రెడ్డిపల్లి శ్రీనివాస్, సాయికిరణ్, కుమార్, కైసర్, సుధాకర్, మహబూబ్, వినోద, షబానా తదితరులు పాల్గొనగా కాలనీకి చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు



# హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి – జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు, సందేహాలను నివృత్తి చేయడానికి సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, అభ్యంతరాలు, సమాచారం కోసం ప్రజలు హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ 81253 52721 కు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ హెల్ప్ డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సెలవు రోజులు సహా 24 గంటలు, మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందని తెలిపారు. హెల్ప్ డెస్క్‌కు అందే ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి, పరిశీలన అనంతరం ఎన్నికల నిబంధనలు మరియు మార్గదర్శకాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రజలు ఈ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.

# బర్దిపూర్ గ్రామంలో సీఎం శంకుస్థాపనలు విద్య, రోడ్లు, సంక్షేమం లక్ష్యంగా

తెలంగాణ | హైదరాబాద్

Indergarh- సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 7 (రిపోర్టర్: శెట్టి వెంకటేష్ గౌడ్): బర్దిపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తెలంగాణ యూనివర్సిటీ, దిచ్‌పల్లి లో ఎస్సీ బాలురు & బాలికల హాస్టళ్ల నిర్మాణానికి రూ. 20.00 కోట్లు, బాలికల హాస్టల్ నిర్మాణానికి రూ. 8.60 కోట్లు, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ. 1.36 కోట్లు, సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి రూ. 18.00 కోట్లు కేటాయించడం జరిగాయి. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, ఇండల్‌వాయి లో సిబ్బంది నివాస గృహాలు మరియు అదనపు సౌకర్యాల పనులకు శంకుస్థాపన, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి మొత్తం రూ. 600.00 కోట్లు (ప్రతి పాఠశాలకి రూ. 200.00 కోట్లు) కేటాయించడం జరిగింది. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజ్ చెక్కులు పంపిణీ చేయడం ద్వారా మొత్తం రూ. 200.00 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో గాంధీనగర్ నుండి బినోలా రోడ్డు మరియు పీడబ్ల్యూడీ & జేఎన్ఎన్ రోడ్డు నుండి సిరన్‌పల్లి వరకు రోడ్డు వెడల్పు మరియు బలోపేత పనులకు రూ. 21.00 కోట్లు, తెలంగాణ యూనివర్సిటీ ఆడిటోరియం, పరిపాలనా భవనం (అడ్మిన్ బిల్డింగ్) మరియు CSE భవనం విస్తరణకు రూ. 43.00 కోట్లు కేటాయించడం ముఖ్యమంత్రి సూచనల మేరకు జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అభివృద్ధి, విద్య, రోడ్లు, సంక్షేమం తదితర రంగాల్లో పునాది వేసే ఈ శంకుస్థాపనలు భవిష్యత్తులో సమగ్ర ప్రగతికి దోహదం చేస్తాయని సీఎం వివరించారు.



# పాపమ్మ గడ్డ కాలనీలోనే రేషన్ పంపిణీ ప్రారంభం

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఫిబ్రవరి 7 (రిపోర్టర్: టీ సంగమేశ్వర్): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామ పరిధిలోని పాపమ్మ గడ్డ కాలనీలో నివసిస్తున్న రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి చొరవతో ఎట్టకేలకు ఊరట లభించింది. గత కొన్ని నెలలుగా రేషన్ సరుకుల కోసం గ్రామంలోని పాత ఊరు వరకు సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి రావడంతో వృద్ధులు, మహిళలు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ సమస్యను గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరీం, వార్డు సభ్యులు కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులు, గ్రామ రేషన్ డీలర్‌తో మాట్లాడి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం పాపమ్మ గడ్డ కాలనీలోనే రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కాలనీలో ఏర్పాటు చేసిన భవనంలో సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరీం చేతుల మీదుగా రేషన్ పంపిణీ జరిగింది. దీంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజల సమస్యను వెంటనే గుర్తించి పరిష్కారం చూపినందుకు ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 7 (పుల్కల్ మండలం ప్రతినిధి: మహేష్ బాబు): పుల్కల్ మండల పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు గొంగ్లూర్ రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా పేద మరియు మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా ఉపశమనం లభిస్తోందని తెలిపారు. మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముద్దాయిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు కమల్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఈ సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచారం లక్ష్మారెడ్డి, ఇసోజిపేట గోవర్ధన్, గొంగ్లూర్ రాంచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ ఎం. ప్రవీణ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పీజీ సత్యనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాఘవేందర్ రెడ్డి, చంద్రయ్యతో పాటు గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# 15వ వార్డులో కొనసాగుతున్న బిఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 7 (టౌన్ ప్రతినిధి: బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణం 15వ వార్డులో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి అశ్విని-శ్రవణ్ కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి అంశాలపై పార్టీ విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ TNGOs రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్ రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఇంచార్జి రాజనర్సు, డా. శ్రీహరి, మందుల వరలక్ష్మి, ఎస్‌కే రషీద్, విఠల్, మల్ల గౌడ్‌తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు

# జిల్లాలో వ్యవసాయ-అనుబంధ శాఖల పనితీరుపై సమీక్ష

తెలంగాణ | సూర్యాపేట

జిల్లాలో వ్యవసాయ-అనుబంధ శాఖల పనితీరుపై సమీక్ష

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 7 (రిపోర్టర్: శెట్టి వెంకటేష్): సూర్యాపేట జిల్లాలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. వెంకటరమణ గారు సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ సుమారు 90 శాతం వరకు పంటల సాగు పూర్తైనట్లు, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, రైతులకు అన్ని రకాల సేవలు అందించడంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. రైతు సంక్షేమ పథకాల అమలు, సబ్సిడీలు, పంట బీమా, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గోదాముల అందుబాటు వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించి, మిగిలిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతుల ఆదాయం పెంచే దిశగా క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి, వివిధ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నిజామాబాద్: దుండగుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబానికి సీఎం 1 కోటి చెక్కు

సందేశం టైమ్స్, నిజామాబాద్, ఫిబ్రవరి 7 (రిపోర్టర్: శెట్టి వెంకటేష్): గతేడాది విధి నిర్వహణలో దుండగుల చేతిలో కత్తిపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయంగా 1 కోటి రూపాయల చెక్కును ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రమోద్ భార్య ప్రణీత గారికి అందించారు. 'ప్రజా పాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి గారు చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం, ప్రజా పాలనలో సౌకర్యం, భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టిందని అధికారులు పేర్కొన్నారు.

# భారత అండర్-19 వరల్డ్ కప్ విజయం – సూర్యవంశీ రికార్డ్ ఇన్నింగ్స్, ఇంగ్లండ్‌పై 100 పరుగుల మెగా విజయం

## భారత యు19 వరల్డ్ కప్ విజయం – మొత్తం టైటిల్స్, సెమీస్ & విజయాలు-ఓటములు సమగ్ర వివరాలు

భారతదేశం | స్పోర్ట్స్ న్యూస్

సందేశం టైమ్స్, స్పోర్ట్స్ డెస్క్, ఫిబ్రవరి 7 (రిపోర్టర్: శెట్టి వెంకటేష్): ICC అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ 2026 ఫైనల్‌లో భారత అండర్-19 క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను 100 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఆరు అండర్-19 వరల్డ్ కప్ టైటిల్స్ను సొంతం చేసుకుంది. ఫిబ్రవరి 6న జింబాబ్వే హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ బ్యాటింగ్ మొదలు పెట్టి 411/9 (50 ఓవర్లలో) పరుగులు చేసింది. ఇందులో 14-ఏళ్ళ యువ ప్రతిభ **వైభవ్ సూర్యవంశీ 175 (80 బంతులు)*తో భారీ రికార్డ్ ఇన్నింగ్స్ చేశాడు; 15 ఫోర్లు, 15 సిక్సర్లతో ఫైనల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించాడు, ఇది U-19 వరల్డ్ కప్‌లోని అత్యధిక ఫైనల్ స్కోరు గట్టించింది. కెప్టెన్ ఆయుష్ మత్రే 53 (51), అభిగ్యాన్ కుండు 40 (31) మరియు కనిష్క్ చోహాన్ 37 (20) వంటి బ్యాట్స్‌మెన్ సమర్థ వ్యవస్థను ఇచ్చారు. ప్రత్యర్థి ఇంగ్లండ్ జట్టు 311 (40.2 ఓవర్లలో) వద్ద ఆలౌట్ అయింది; ఇక్కడ కేలెబ్ ఫాల్కనర్ 115, బెన్ డాకిన్స్ 66 రన్‌లతో విభిన్నంగా బ్యాటింగ్ చేశారని తెలిపిన స్కోర్లు గణనీయంగా ఉన్నాయి. బౌలింగ్‌లో భారత యువకులు కూడా సక్సెస్ ఇచ్చింది; ఆర్ఎస్ అంబ్రిష్ 3/56 మరియు కనిష్క్ చోహాన్ 2/63 వికెట్లు తీశారు. భారత జట్టు ముందుగా అఫ్ఘానిస్తాన్‌ను సెమీఫైనల్‌లో 7 వికెట్ల తేడాతో ఓడించి (311/3 vs 310/4) ఫైనల్‌కు ప్రవేశించింది, ఇందులో ఆరన్ జార్జ్ 115, సూర్యవంశీ 68 మరియు మత్రే 62 వంటి కీలక స్కోర్లు ప్లే-ఆఫ్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. భారత అండర్-19 స్క్వాడ్‌లో మద్దతుగా ఆటపోటు, యువ టాలెంట్లు కనిపిస్తుండగా ప్రధాన ఆటగాళ్లు: ఆయుష్ మత్రే (కెప్టెన్), విహాన్ మాల్హోత్రా (వైస్ కెప్), వైభవ్ సూర్యవంశీ, ఆరన్ జార్జ్, అభిగ్యాన్ కుండు, అవి.ఎన్, హెనిల్ పాల్, ఉధవ్ మోహన్ తదితరులు ఉన్నాయి. జట్టు ప్రధాన కోచ్‌గా హృషికేశ్ కానిట్కర్, బౌలింగ్ కోచ్ సునీల్ జోషి, ఫీల్డింగ్ కోచ్ మునీష్ బాలి మరియు బ్యాటింగ్ కోచ్ వంటి అనుబంధ సిబ్బంది వ్యవస్థతో శిక్షణ అందించారు. ఈ విజయం భారత యువ క్రికెట్ వ్యవస్థ పునాది బలపరిచినదని విశ్లేషకులు పేర్కొంటున్నారు, అలాగే యువ ఆటగాళ్లను ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన భావి ఆటగాళ్లుగా నిలబెట్టిన ప్రతిభగా ఇది గుర్తించబడింది.










ICC అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ 2026లో భారత అండర్-19 జట్టు ఫిబ్రవరి 6న జింబాబ్వే హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో గెలిచి ఐదోసారి కాదు, మొత్తం ఆరు U-19 వరల్డ్ కప్ టైటిల్స్ను సొంతం చేసుకుంది. ఇదివరకు భారత్ 2000, 2008, 2012, 2018, 2022ల్లో కూడా టైటిల్ తెచ్చుకుంది, ఈ 2026 విజయం భారత యువ క్రికెట్‌లో విశేష స్థానంగా నిలిచింది. భారత జట్టు మూడు గ్రూప్ మ్యాచ్‌ల్లో, సూపర్ సిక్స్, సెమీఫైనల్‌లో కూడా ఓటమి లేకుండా విజయం సాధించి (ఉదా: న్యూజిలాండ్‌పై 7 వికెట్ల, పాకిస్తాన్‌పై 58 పరుగుల గెలుపులు), ఫైనల్‌కు పరుగులు వేసింది. భారత జట్టు ఫైనల్ విజయంతో వరల్డ్ కప్‌లో అజేయ రికార్డ్‌ను కూడా కొనసాగించింది, అలాగే ఇది దశాబ్దాలుగా ప్రపంచ యువ క్రికెట్‌లో ప్రతిభని నిరూపించింది. U-19 వరల్డ్ కప్ చరిత్రలో భారత జట్టు మొత్తం ఆరు టైటిల్స్, మూడు సార్లు రన్నర్-అప్ (2006, 2016, 2020) మరియు చివరగా 2024లో ఆస్ట్రేలియాకు సోలినది కూడా ఉంది, దీని ద్వారా భారత యువ గడ్డ దేవుడైనదాని రూపంలో కోటి క్రికెట్ అభిమానులకు గర్వకారణమైంది



## ప్రశాంత వాతావరణంలో కోరుట్ల మున్సిపాలిటీ ఎన్నికలు కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ

కోరుట్ల ఫిబ్రవరి 7 (సందేశం టైమ్స్ - రిపోర్టర్: శెట్టి వెంకటేష్) - రాబోయే కోరుట్ల మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఉద్దేశిస్తూ, జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మెట్పల్లి డి.ఎస్.పి అడ్డూరి రాములు ఆధ్వర్యంలో ఈరోజు కోరుట్ల పట్టణ పరిధిలోని పలు వార్డులలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, సామాన్య ప్రజలు ఏ ప్రలోభానికి గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని అధికారులు ఉద్దేశించారు. కార్యక్రమంలో కోరుట్ల సిఐ బి సురేష్ బాబు, మెట్పల్లి సిఐ అనిల్ కుమార్, కోరుట్ల ఎస్సై ఎం చిరంజీవి, ఎస్ఐ రామచంద్రం, మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, కతలాపూర్ ఎస్ఐ రవికుమార్, మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్, మల్లాపూర్ ఎస్ఐ అనిల్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్, మరియు సబ్ డివిజనల్ ఫోర్స్‌లో సుమారు 70 మంది పోలీసులు పాల్గొని ఫ్లాగ్ మార్చ్‌ను విజయవంతంగా నిర్వహించారు.



## ట్యాంపరింగ్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం: సీఎం చంద్రబాబు

సందేశం టైమ్స్, కలుగొట్ల / ఫిబ్రవరి 7 - కర్నూలు జిల్లా కలుగొట్లలో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు, భూమి యజమానికి పూర్తి సర్వహక్కులు కల్పించామని, ఇకపై ఎవరు భూములపై కన్నేయలేరని సీఎం స్పష్టం చేశారు. గతంలో భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వచ్చాయని, ప్రస్తుతం కొత్త వ్యవస్థతో భూమి రికార్డులను ఎవరి పేరుతోనైనా మారిస్తే వెంటనే తెలిసేలా సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను నేరుగా మొబైల్ ఫోన్‌లోనే చూసుకునే అవకాశం కల్పించామని, భూ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా భద్రపరిచామని చెప్పారు. భూమి రికార్డుల్లో ట్యాంపరింగ్‌కు పాల్పడితే ఎలాంటి మినహాయింపు లేకుండా నేరుగా జైలుకు పంపిస్తామని సీఎం చంద్రబాబు కఠిన హెచ్చరిక జారీ చేశారు.




## కూర్మాపురం పులి కష్టాలు ముగిశాయి.. మత్తు ఇంజక్షన్ తో సురక్షిత పట్టింపు

సందేశం టైమ్స్, ఈస్ట్ గోదావరి, ఫిబ్రవరి 7 (రిపోర్టర్: శెట్టి వెంకటేష్): తూర్పు గోదావరి జిల్లాలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న పులిని అటవీ శాఖ సిబ్బంది ఆపరేషన్ టైగర్‌గా పేరుతో సురక్షితంగా పట్టుకున్నారు. ఈ పెద్దపులి రెండు వారాలకు పైగా కూర్మాపురం, రాయవరం పరిసర గ్రామాల్లో గాడ్రింపులు చేయగా, పశువులపై దాడులు, ప్రాణసంక్షేమభావాలు కలిగించడం వలన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అటవీ అధికారులు, ప్రత్యేక నిపుణుల సహకారంతో పుణేపంచనుండి వచ్చిన రెస్క్యూ బృందం మత్తు ఇంజక్షన్ ఇచ్చి పులిని నిద్రపోసిన తర్వాత పట్టుకోవడంలో విజయం సాధించారు. ఇది ఆరు రోజులపాటు పులి పట్టుబడకపోవడంతో ప్రజలు ఇంట్లోనే ఉండగా, అటవీ, పోలీస్ సిబ్బంది డ్రోన్లు, థర్మల్ కెమెరాలు, ఫెరిక్స్ నిర్వాహకాలను ఉపయోగించి భారీ క్షేత్ర కార్యాచరణ నిర్వహించారు. పులిని సురక్షితంగా పట్టుకొని తదుపరి పరిరక్షణ చర్యల కోసం వన్యప్రాణి కేంద్రానికి తరలించే యాజమాన్యం చేపట్టింది. పులి సంచారం సమయంలో పశువులపై దాడులు, గాడ్రింపులు జరిగాయి అని స్థానికులు ఆదారంగా తెలిపారు. అటవీ శాఖ ఈ ఆపరేషన్ విజయంతో స్థానికులకు ఊపిరి పీల్చే పరిస్థితి సృష్టించిందని అధికారులు చెప్పారు. ఈ మధ్య కాలంలో పులి బాధిత ప్రాంతాల్లో ప్రజలకు జాగ్రత్త చర్యలు, అటవీ సూచనలను అనుసరించాలని హెచ్చరించారు.

పత్రికపేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.